క్లుప్తంగా

వైఎస్ జగన్‌ను కలిసిన మాజీ మంత్రి సురేష్



వైఎస్ జగన్‌తో ఆదిమూలపు సురేష్, వసంత్

కొండపి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, కొండపి నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జ్ డాక్టర్ ఆదిమూలపు సురేష్ సోమవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో కలిశారు. ఆయన వెంట కొండపి మండలం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యువనేత వై.వసంతరావు ఉన్నారు.

జగన్‌ను కలిసిన పుట్టా...



వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పుట్టా వెంకట్రావు

టంగుటూరు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని రాష్ట్ర ఎంబీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పుట్టా వెంకట్రావు సోమవారం వైఎస్సార్ సీపీ కేంద్ర కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పార్టీ కార్యక్రమాలు, తదితర విషయాలను జగన్ దృష్టికి తీసుకెళ్లినట్లు పుట్టా తెలిపారు.

వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి సురేష్



వధూవరులను ఆశీర్వదిస్తున్న ఆదిమూలపు సురేష్, నాయకులు

కొండపి: మండలంలోని చోడవరం గ్రామంలో ఆదివారం రాత్రి రాయపాటి శ్రీను కుమారుని వివాహానికి హాజరైన వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యుడు, మాజీ మంత్రి, పార్టీ కొండపి నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఆదిమూలపు సురేష్ వధూవరులను ఆశీర్వదించారు. ఆయనకు రాయపాటి శ్రీను కుటుంబ సభ్యులు ఘనంగా స్వాగతం పలికారు. ఆయన వెంట పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, కొండపి మండల నాయకులు, గ్రామ నాయకులు ఉన్నారు.

ఘనంగా డాక్టర్ బత్తుల పుట్టిన రోజు వేడుకలు





బత్తులకు కేక్ తినిపిస్తున్న మాజీ మంత్రి సురేష్, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి

సింగరాయకొండ: వైఎస్సార్ సీపీ వైద్య విభాగం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి పుట్టినరోజు వేడుకలను సోమవారం సింగరాయకొండ మండల కేంద్రంలోని ఆయన నివాసంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ పీఏసీ మెంబర్, నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి, యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ బత్తులకు కేక్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు. పీడీసీసీబీ మాజీ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య, కొండపి నియోజకవర్గంలోని ఆరు మండలాల నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొని బత్తులకు శుభాకాంక్షలు తెలిపారు.

నారాయణస్వామి ఆలయంలో ఏసీ ప్రత్యేక పూజలు



అన్నదానాన్ని ప్రారంభిస్తున్న ఏసీ పానకాలరావు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయాన్ని సోమవారం దేవదాయ ధర్మాదాయశాఖ సహాయ కమిషనర్ వెం.పానకాలరావు సందర్శించారు. ఈ సందర్భంగా స్వామివారి ఆలయంలో పూజల్లో పాల్గొనగా అర్చకులు పూజల అనంతరం వేద ఆశీర్వచనం చేసి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అన్నదాన మండపంలో అన్నదానాన్ని ఏసీ పానకాలరావు ప్రారంభించారు. ఆదివారం నాడు ఆలయ ఆదాయం రూ.2,27,483 వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఇన్‌స్పెక్టర్ జీఏ సత్యనారాయణ, కొమ్మినేని వెంకట్రావు పాల్గొన్నారు.

సమస్యలతో విద్యార్థుల సహవాసం

- అద్దె భవనాల్లో సంక్షేమ హాస్టళ్లు
- కన్నీళ్లు పెడుతున్న కాలేజీ హాస్టల్ విద్యార్థులు
- వసతులు పట్టించుకోని వెల్ఫేర్ అధికారులు



కనిగిరి: చిల్లచెట్ల మధ్య రేకుల గదిలో ఎస్సీ కాలేజీ హాస్టల్



పామూరు ఎస్సీ హాస్టల్లో ఉన్న ఒకే ఒక్క బాలుడు



పీసీపల్లి: ఎస్సీ బాలుర వసతి గృహంలో ఆగిన బాత్‌రూమ్‌ల నిర్మాణం



హెచ్ఎంపాడు: ఎస్సీ హాస్టల్లో అధ్వానంగా ఉన్న ఒకే ఒక్క మరుగుదొడ్డి



కనిగిరి: ఇరుకు గదుల్లో కాలేజీ విద్యార్థులు



కనిగిరి: చిరిగిన దోమల మెస్‌లు

కనిగిరి రూరల్: వసతి గృహాల్లో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. సంక్షేమ హాస్టళ్లు కాస్తా..సంక్షామ హాస్టళ్లుగా మారాయంటే అతిశ యోక్తికాదు. కనిగిరి నియోజకవర్గంలోని దాదాపు 65 శాతం హాస్టళ్లు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి. కొన్నింటికి సొంత భవనాలు ఉన్నా.. వాటిలో విద్యుత్, తాగు, వాడుక నీరు సక్రమంగా లేక విద్యార్థులు పడుతున్న అవస్థలు వర్ణనాతీతం. 'సాక్షి' రిపోర్టర్‌లు ఆది, సోమవారాల్లో పలు హాస్టళ్లను తనిఖీ చేశారు. అనేక విచారకర. దుర్భర ఘటనలు కనిపించాయి. కొన్ని హాస్టల్స్‌కు మరుగుదొడ్లకు తలుపులు లేవు. మరికొన్ని చోట్ల విద్యార్థులు ఆరు బయట బోర్ల వద్ద స్నానాలు చేస్తున్నారు. కప్పుకునేందుకు దుప్పట్లు పంపిణీ చేయలేదు. కాస్మొటిక్ చార్జీలు రాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. రేకుల గదుల్లో చాల చాలనీ ఇరుకు గదుల్లో పడుకుంటున్నారు. ఇక విద్యార్థుల రోల్‌కు విరుద్ధంగా కొన్ని హాస్టల్స్‌లు ఒకరిద్దరు మాత్రమే కనిపించారు. స్థానిక ప్రభుత్వ బీసీ బాలుర వసతి గృహం–2లో 45 మందికి ముగ్గురు పిల్లలే కనిపించారు. స్విచ్ బోర్డులు అన్ని ఇరిగి ప్రమాదంగా ఉన్నాయి. పామూరు పట్టంలోని ఎస్సీ బాలుర హాస్టల్స్ సుమారు 30 రోల్ ఉండగా ఒక్క విద్యార్థి మ్రాతమే ఉన్నాడు. చాలా హాస్టల్స్‌లో 80 నుంచి 100 మంది విద్యార్థుల రోల్ చూపిస్తున్నా క్షేత్ర స్థాయిలో 20కి మించి లేరు. వార్డెన్‌లు మాత్రం ఇప్పుడే విద్యార్థులు బయటకు వెళ్లారని, ఆపార్ కార్డుల కోసం వెళ్లారని, విహార యాత్రలకు వెళ్లారని కబుర్లు చెప్పారు. ఆరు మండలాల్లో ఎస్సీ హాస్టల్స్‌ల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఎస్టీ హాస్టల్లో తలుపులన్నీ పగిలిపోయి విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రి వేళ చలిగాలులకు వణుకు తున్నారు. హాస్టల్ విద్యార్థులకు కాస్మొటిక్ చార్జీలు, దుప్పట్లు, ట్రంక్ పెట్టెలు, పళ్లాలు చాలా చోట్ల పంపిణీ చేయలేదు.

కాలేజీ విద్యార్థుల అవస్థలు

భావి భారత పౌరులుగా తయారు కావాల్సిన కాలేజీ విద్యార్థులు తమ గోడు బయటకు చెప్పుకోలేక కన్నీళ్లు పెడుతున్నారు. పట్టణంలోని నాగుల చెరువు సమీపంలోని కాలేజీ బాయ్స్ హాస్టల్స్‌లో సుమారు 40 రోల్ ఉండగా విజిట్ సమయంలో 20 మంది ఉన్నారు. క్షేత్ర స్థాయిలో పట్టుమని పది మంది కూడా లేరు. ఆహాస్టల్స్ చిల్లకంపల మధ్య మరింత దయనీయంగా ఉంది. మురికి నీరు పోయే పరిస్థితి లేదు. రేకుల గదుల్లో కిటికీలకు తలుపులు లేక, ఫ్యాన్లు తిరగక రాత్రి పూట ప్రాంగణంలోకి పాములు తిరుగుతున్నాయి. మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు చిల్ల చెట్లల్లోకి బయటకు చంబు పట్టుకుని పోవాల్సిన దుస్థితి. కొత్తపేట బీసీ కాలేజీ హాస్టల్స్‌లో 90 మంది వరకు రోల్ ఉన్నట్లు చూపుతున్నా విజిట్ సమయంలో ఆదివారం 56 మంది హాజరైనట్లు చెప్పారు

కనిగిరిలో..

మండలంలో ఒక కస్తూరిబా, ఒక ఎస్టీ గిరిజన గురుకుల పాఠశాల, నాలుగు ఎస్సీ హాస్టల్స్ మూడు బాలుర, ఒకటి బాలికల) హైస్కూల్ స్థాయిలో, రెండు ఎస్సీ కాలేజీ హాస్టల్స్ ఉన్నాయి. ఒక హాస్టల్ మూత పడింది. పట్టణంలోని ఆనంద నిలయం హాస్టల్ పాత భవనంలో, కంచర్లవారిపల్లి ఎస్సీ హాస్టల్స్ స్కూల్ భవనంలో నడుస్తోంది. రెండు బీసీ బాలుర, ఒక బాలికల హాస్టల్స్‌లోఉండగా అందులో బాలుర హాస్టల్ ఒకటి అద్దె భవనంలో ఉంది. రెండు బీసీ (బాలికల, బాలుర) హాస్టల్స్ రెండు అద్దె భవనాల్లో నడుస్తున్నాయి. ఎస్సీ బాలుర హాస్టల్ కూడా అద్దె భవనంలో నడుస్తోంది.

సీఎస్‌పురంలో..

మండలంలో అద్దె భవనాల్లోనే సంక్షేమ హాస్టళ్లు ఉన్నాయి. మండలంలో మొత్తం నాలుగు హాస్టళ్లు అద్దె భవనాల్లో ఉన్నాయి. శీలంవారిపల్లె హాస్టల్‌ను విజిట్ చేయగా విద్యార్థులకు ఇప్పటి వరకు బెడ్‌షీట్లు, దుప్పట్లు ఇవ్వలేదని, అదేవిధంగా కాస్మొటిక్ చార్జీలు ఇవ్వలేదని తెలిపారు.

హనుమంతునిపాడులో..

హనుమంతునిపాడు మండల కేంద్రంలో ఉన్న ఎస్సీ హాస్టల్లో వసతులు సరిపడా లేక అధ్వాన పారిశుధ్యంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నామని విద్యార్థులు తెలిపారు. హనుమంతునిపాడు మండల కేంద్రంలో ఒక ఎస్సీ బాలుర హాస్టల్, ఒక కస్తూరిబా బాలికల హాస్టల్ ఉంది. సాక్షి విలేకర్ ఎస్సీ బాలుర వసతి గహాని తనిఖీ చేయగా అక్కడ సరిపడా వసతు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. 100 మంది విద్యార్థులకు ఒకే మరుగు దొడ్డి, స్నానపు గదులులేవు.

పీసీపల్లిలో..

మండలంలోని కస్తూరిబా, ఎస్సీ బాయ్స్ హాస్టల్స్ ఉన్నాయి. ఎస్సీ హాస్టల్స్ అద్దె భవనంలో ఉంది. వర్షం పడితే కురుస్తుండటంతో విద్యార్థులు అనేక ఇక్కట్లు పడుతున్నారు. మరుగుదొడ్లు లేక పోవడంతో రాత్రి పూట సుమారు 80 మంది విద్యార్థులు బయటకు వెళ్లాల్సిన దుస్థితి. వంట గది సౌకర్యం లేక, తాగు, వాడుక నీటి సౌకర్యం లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. ఆరు బయట స్నానం చేయాల్సి దుస్థితి.

పామూరులో..

మండలంలో మొత్తం 2 హాస్టళ్లు ఉన్నాయి. వీటిలో ఒక బీసీ బాలుర వసతి గృహం, ఒక ఎస్సీ బాలుర వసతి గృహం ఉన్నాయి. బాలికల హాస్టల్ లేదు. కాలేజీ హాస్టళ్లు లేవు. బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాల్లో మొత్తం 140 మంది పిల్లలు ఉంటారు. ఉన్న ఎస్సీ బాలుర, బీసీ బాలుర వసతి గృహాలు రెండు సొంత భవనాలే. ఆదివారం రాత్రి మొదట ఎస్సీ బాలుర హాస్టల్, అనంతరం బీసీ బాలుర వసతి గృహాలను తనిఖీ చేశారు.

ఎస్సీ బాలుర హాస్టల్‌కు ఒకే ఒక్కడు

మండల కేంద్రం పామూరులోని ఎస్సీ బాలుర వసతి గృహాన్ని ఆదివారం రాత్రి విజిట్ చేయగా హాస్టల్లో 30 మందికి కాకి శాంసన్ అనే ఒకే ఒక్క విద్యార్థి ఉన్నాడు. విద్యార్థులు లేక హాస్టల్ నిర్మానుష్యంగా ఉంది. హాస్టల్ కిటికీలకు ఉన్న మెస్‌లు చిరిగిపోయి ఉన్నాయి. బీసీ బాలుర వసతి గహాన్ని తనిఖీ చేయగా వారు డైనింగ్ హాల్ లేకపోవడంతో ఆరుబైట కూర్చుని భోజనం చేస్తున్నారు.

దుప్పట్లు ఇవ్వలేదు



విద్యా సంవత్సరం సగం పూర్తయింది. రాత్రి వేళల్లో చలిగా ఉంది. ఇంత వరకు ఈ సంవత్సరం హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు ఇవ్వలేదు. అదేవిధంగా కాస్మొటిక్ చార్జీలు కూడా ఇవ్వలేదు. తక్షణం దుప్పట్లు, కాస్మొటిక్ చార్జీలు ఇప్పించాలి.

– కాకి శ్యాంసన్, 10వ తరగతి, ఎస్సీ హాస్టల్

ట్యూటర్లను నియమించాలి



నేను 10వ తరగతి చదువుతున్నా. మాకు హాస్టల్లో ట్యూటర్లు లేరు. డౌట్స్ క్లారిఫై చేసుకునేందుకు ఇబ్బందిగా ఉంది. అదేవిధంగా అర్ధ సంవత్సరం పూర్తి కావస్తున్నా కాస్మొటిక్ చార్జీలు ఇవ్వలేదు. అదేవిధంగా దుప్పట్లు ఇవ్వలేదు.

– ఎం.మణివర్ధన్, 10వ తరగతి, బీసీ హాస్టల్

హాస్టల్ భవనం.. భయంకరం

- కొండపి నియోజకవర్గంలో పాడుబడిన భవనాల్లోనే ప్రభుత్వ హాస్టళ్ల నిర్వహణ
- కనీస వసతులు కరువై విద్యార్థులకు అవస్థలు
- పట్టించుకోని ప్రభుత్వం, అధికారులు, పాలకులు

సాక్షి గ్రాండ్ రిపోర్ట్

సింగరాయకొండ: కొండపి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో హాస్టల్ భవనాల పరిస్థితి భయంకరంగా ఉంది. పాడుబడి శిథిలావస్థకు చేరిన భవనాల్లో హాస్టళ్లు నిర్వహిస్తుండటంతో వాటిలో కనీస వసతులు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆరు నెలలుగా హాస్టళ్ల గురించి పట్టించుకోకపోవడంతో దుర్భర పరిస్థితులు నెలకొని విద్యార్థులు నరకం చూస్తున్నారు. ప్రస్తుతం చలికాలం ప్రారంభమైనా.. హాస్టల్ విద్యార్థులకు దుప్పట్లు లేవు. మంచాలు లేక కిందపడుకుంటూ అవస్థపడుతున్నారు. మినరల్ వాటర్ ప్లాంట్లు చెడిపోవడంతో బయట నుంచి తాగునీరు కొనుక్కోవాల్సిన దుస్థితి. తలుపులు లేని మరుగుదొడ్లు, అపరిశుభ్రంగా హాస్టల్ పరిసరాలతో దోమల బెడద తీవ్రంగా ఉంది. గదుల్లో విద్యార్థులకు సరిపడా ఫ్యాన్లు లేవు. ఉన్న ఫ్యాన్లు కూడా సక్రమంగా పనిచేయవు. అంతే కాకుండా హాస్టల్ మెయింటెనెన్స్ గ్రాంటు విడుదల చేయకపోవటంతో ప్రతి నెలా తమ జీతంలో సుమారు 10 శాతం నిధులు వసతి గృహం కోసం ఖర్చుపెడుతున్నామని వార్డెన్లు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం హాస్టళ్ల నిర్వహణకు రూపాయి విదల్చకపోవడంతో ఎంతకాలం మా జీతం డబ్బులు పెడతామంటూ వార్డెన్లు వాపోతున్నారు. విద్యార్థులకు ప్రతినెలా కాస్మొటిక్ చార్జీలు కూడా ప్రభుత్వం ఇవ్వడం లేదు. కొండపి నియోజకవర్గంలోని హాస్టళ్లన్నీ దారుణంగా ఉండటంతో విద్యార్థుల సంఖ్య కూడా తగ్గిపోయింది. కొన్ని మండలాల్లో విద్యార్థులు లేక హాస్టళ్లు మూతపడ్డాయని ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

- సింగరాయకొండ మండలంలో బీసీ, ఎస్సీ బాలుర వసతి గృహాలు, బీసీ బాలురు, బాలికల కాలేజీ వసతి గృహాలు ఉన్నాయి. ఎస్సీ బాలురు, బాలికల కాలేజీ హాస్టళ్లు విద్యార్థులు లేక మూతపడ్డాయి. బీసీ బాలుర వసతి గృహం ప్రైవేటు భవనంలో ఉంది. ఇక్కడ రికార్డుల ప్రకారం 60 మంది వరకు విద్యార్థులు ఉన్నప్పటికీ సుమారు 25 మంది మాత్రమే ఉంటున్నారు. రేకుల గదుల్లో ఉండటంతో ఎండాకాలం ఎండ తీవ్రతకు, చలికాలం చలి తీవ్రతకు విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. బాత్‌రూమ్‌లు, మరుగుదొడ్లకు తలుపులు లేవు. కేవలం ఒక బాత్‌రూమ్, 4 మరుగుదొడ్లు ఉండగా, ఆరుబయట స్నానం చేయాల్సి వస్తోందని విద్యార్థులు తెలిపారు. పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో దోమల బెడద అధికంగా ఉంది. బీసీ కాలేజీ బాలుర వసతి గృహంలో వాటర్‌ప్లాంటు మరమ్మతులకు గురైంది. మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయి. తలుపులు కూడా లేవు. మంచాలు లేక కింద పడుకోవాల్సిన దుస్థితి. దుప్పట్లు, కాస్మొటిక్ చార్జీలు ఇవ్వడంలేదు. ఎస్సీ బాలుర వసతి గృహం పరిసరాలు అధ్వానంగా ఉన్నాయి. దోమల బెడద తీవ్రంగా ఉంది. మంచాలు లేక విద్యార్థులు కింద పడుకుంటున్నారు. హాస్టల్ గేటు కూడా మరమ్మతులకు గురైంది.



పొన్నలూరు : పాడుబడిన ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలుర వసతి గృహం




సింగరాయకొండ : పాడుబడిన ప్రైవేటు భవనంలో కొనసాగుతున్న ఎస్సీ బాలుర కాలేజీ వసతి గృహం

- జరుగుమల్లి మండలంలోని జరుగుమల్లిలో ఎస్సీ బాలికల వసతి గృహంలో విద్యార్థినులు కింద పడుకుంటున్నారు. గత ప్రభుత్వం మంచాలు కేటాయించినప్పటికీ అవి ఎత్తుగా ఉన్నాయని స్టోర్‌రూమ్‌కు పరిమితం చేశారు. గదుల్లో ఫ్యానులు సక్రమంగా తిరగవు. వాటర్‌ప్లాంటు మరమ్మతులకు గురైంది. విద్యార్థినులకు కాస్మొటిక్ చార్జీలు, దుప్పట్లు ఇవ్వలేదు.
- కొండపి మండల కేంద్రంలో ఎస్సీ, బీసీ బాలుర వసతి గృహాలు మూతపడ్డాయి. బీసీ బాలుర వసతి గృహంలో కొన్ని గదులను ఈ సంవత్సరం కాలేజీ విద్యార్థులకు కేటాయించారు. ప్రస్తుతం 10 మంది విద్యార్థులు ఉన్నారు. ఈ హాస్టల్లో బాత్‌రూమ్‌లు అధ్వానంగా ఉన్నాయి. గదులకు తలుపులు బాగలేవు. బోరు పంపు పనిచేయటం లేదు. బయట నుంచి మంచినీరు తెచ్చుకుంటున్నారు. హాస్టల్ పరిసరాలు పిచ్చిచెట్లతో అధ్వానంగా ఉన్నాయి.
- మర్రిపూడి మండలంలోని కాకర్ల గ్రామంలో ఎస్సీ బాలుర వసతి గృహం ఉంది. హాస్టల్ గదుల కిటికీలు, తలుపులు సక్రమంగా లేక దోమల బెడద ఎక్కువగా ఉంది. దుప్పట్లు లేక విద్యార్థులు చలికి ఇబ్బందులు పడుతున్నారు. మెయిన్‌గేటు మరమ్మతులకు గురైంది. వాడుక నీటి పైపులైను పగలడంతో విద్యార్థులు దుస్తులు ఉతుక్కోవడానికి నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. మంచాలు లేక కింద పడుకుంటున్నారు.



కొండపి : బాలుర వసతి గృహంలో అధ్వానంగా ఉన్న మరుగుదొడ్డి

- టంగుటూరు మండల కేంద్రంలోని బీసీ బాలికల గురుకుల పాఠశాల వసతి గృహంలో సరిపడినన్ని మరుగుదొడ్లు, స్నానాల గదులు లేవు. బీసీ బాలుర గురుకుల పాఠశాల తరగతి గదుల్లో బల్లలు లేవు. ఆరుబయటే తరగతి గదులు నిర్వహిస్తున్నారు. సీసీ కెమేరాలు ఏర్పాటు చేయలేదు.
- పొన్నలూరు మండల కేంద్రంలో ఎస్సీ బాలుర వసతి గృహాన్ని అద్దె భవనంలో నిర్వహిస్తున్నారు. ఈ సంవత్సరం కేవలం ఆరుగురు విద్యార్థులు మాత్రమే చేరడంతో వసతి గృహాన్ని మూసివేశారు.



సింగరాయకొండ : బీసీ బాలుర కాలేజీ వసతి గృహంలో బాత్‌రూమ్ దుస్థితి..

అర్హులకు నివేశన స్థలాలు ఇవ్వాలి



ధర్నా చేస్తున్న సీపీఐ నాయకులు, ప్రజలు

పామూరు: అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు నివేశన స్థలాలు ఇవ్వాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సయ్యద్ మౌలాలీ, మండల కార్యదర్శి పోతల ప్రభాకర్ అన్నారు. స్థానిక గ్రామ సచివాలయం వద్ద సోమవారం అర్హులైన పేదలందరికీ గ్రామాల్లో 3 సెంట్లు, పట్టణంలో 2 సెంట్లు చొప్పున నివేశన స్థలాలు ఇచ్చి నిర్మాణ కోసం రూ.5 లక్షలు మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం ఇచ్చే ఇసుక, ఇనుము, కంకరను ఉచితంగా ఇవ్వాలన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించి పేదలను ఆదుకోవాలన్నారు. తమ డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని పంచాయతీ కార్యదర్శి జీవీ అరవిందకు అందజేశారు. వజ్రాల సుబ్బారావు, సహాయ కార్యదర్శులు పి.నూరి బాబు, మస్తాన్‌రావు, రఘునాథరెడ్డి పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో కార్తీక సోమవారం పూజలు

కనిగిరి రూరల్: కార్తీక సోమవారం వేడుకలను కనిగిరిలో సోమవారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పట్టణంతో పాటు మండలంలోని పలు ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. ప్రత్యేకించి శైవ క్షేత్రాలు శివ నామస్మరణతో మార్మోగాయి. స్థానిక సాయిబాబా దేవస్థానంలో మహాన్యాస పూర్వక రుద్రాభిషేకాలు జరిగాయి. భవానికి శంకర స్వామిని రుద్రాక్షలతో ప్రత్యేక అలంకరణ చేశారు. ఆలయ కమిటీ నాయకులు పాల్గొన్నారు. విజయమార్తండేశ్వర స్వామి ఆలయంలో, కాశీవిశ్వేశ్వర సమేత ఆలయంలో, పునుగోడు సిద్దేశ్వర స్వామి ఆలయంలో, నందనమారెళ్లలోని బాల కోటేశ్వర స్వామి ఆలయంలో, కనకపట్నంలోని శివాలయంలో జరిగిన ప్రత్యేక పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

దద్దాల ఆర్థిక సాయం



మృతుడి బంధువులతో దద్దాల నారాయణ

కనిగిరి రూరల్: ఇటీవల మాచవరంలో అనారోగ్యంతో మృతి చెందిన జెన్నిపోగు ప్రభాకర్ కుటుంబాన్ని సోమవారం వైఎస్సార్ సీపీ కనిగిరి ఇన్‌చార్జి డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ పరామర్శించారు. మృతుని సతీమణి విశ్రాంతమ్మ (వసంత)కు రూ.20 వేల ఆర్థిక సాయం దద్దాల నారాయణ యాదవ్ అందజేశారు. పార్టీ అన్ని విధాలా ప్రభాకర్ కుటుంబానికి అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మడతల కస్తూరిరెడ్డి, మాజీ సింగిల్ విండో చైర్మన్ సూరసాని మోహన్‌రెడ్డి, ఎస్సీ సెల్ నాయకులు కటికల వెంకట రత్నం, భాస్కర్‌రెడ్డి, కౌన్సిలర్ పాతిరెడ్డి రాజారెడ్డి, చంద్రశేఖర్, రాజబాబు, బెంజిమెన్, విజయ్, ఇమ్మానియేలు, కృపారావు, రవి, రత్నం, ఇశ్రాయేలు పాల్గొన్నారు.

రెస్టారెంట్‌ల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

కనిగిరి రూరల్: రెస్టారెంట్లు, హోటల్స్, దాబా హోటల్స్, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు నాణ్యత ప్రమాణాలు, పరిశుభ్రతను పాటించాలని మున్సిపల్ శానిటరీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌కే నాయబ్ రసూల్ అన్నారు. పట్టణంలోని పలు రెస్టారెంట్‌లు, హోటల్స్‌ను సోమవారం ఆయన తనిఖీ చేశారు. నిబంధనలు ఉల్లంఘించిన వారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఆహార పదార్థాలు నిల్వ ఉంచినవి విక్రయిస్తే తీవ్ర పరిణామాలు ఉంటాయని, ఎప్పటికప్పుడు తాజా సరుకులను మాత్రమే వంటకాల్లో వాడాలని సూచించారు.

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

పామూరు: ప్రభుత్వ స్థలాలు, బాటలు ఆక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ బీవీ రమణారావు హెచ్చరించారు. మండల కేంద్రం పామూరులోని విరాట్‌నగర్ వద్ద కాళహస్తిబాట ఆక్రమించి ప్లాట్లు వేస్తున్నారని ఇచ్చిన ఫిర్యాదుపై సోమవారం ఆయన క్షేత్రస్థాయిలో కాళహస్తి బాటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే నిర్వహించి ఆక్రమణ జరిగి ఉంటే తొలగిస్తామని, బాధ్యులపై చర్యలు తీసుకుంటామన్నారు. ఆయన వెంట రెవెన్యూ సిబ్బంది, పలువురు విరాట్‌నగర్ వాసులు పాల్గొన్నారు.

పోలేరమ్మ ఆలయ హుండీ ఆదాయం రూ.25.68 లక్షలు

జరుగుమల్లి (సింగరాయకొండ): జరుగుమల్లి మండలం కామేపల్లి గ్రామంలో ప్రసిద్ధి చెందిన పోలేరమ్మ తల్లి ఆలయంలో సోమవారం హుండీ లెక్కించినట్లు దేవస్థాన కార్యనిర్వాహక అధికారి బైరాగి తెలిపారు. జూన్ 14 నుంచి నవంబర్ 18వ తేదీ కాలానికి నిర్వహించిన హుండీ లెక్కింపులో దేవస్థానానికి 25 లక్షల 68 వేల 570 రూపాయల నగదు, 103 గ్రాముల బంగారం, ఒక కేజీ 668 గ్రాముల వెండి వచ్చినట్లు వివరించారు.

మోసగించిన వ్యక్తికి మూడు నెలల జైలు

కనిగిరి రూరల్: నెల్లూరు జిల్లా జండా దిబ్బా గ్రామానికి చెందిన కర్రెద్దుల కోటమ్మ, పోలయ్యలు తేనే అమ్ముకుని జీవనం సాగిస్తున్నారు. ఈ నేపథ్యంలో 16–08–2016లో పీసీపల్లి మండలం వెంగళాయపల్లికి చెందిన మొగుళ్లూరు వరమ్మ, ఇంటి బయట ఇస్త్రీ చేస్తుండగా కోటమ్మ, పోలయ్యలు ఆమె వద్దకు వెళ్లి తేనె అమ్ముతామని చెప్పి మాటలు కలిపి మరుసటి రోజు వచ్చి తేనె వారికిచ్చి తమ దగ్గర బంగారం ఉందని, లక్ష రూపాయలకు ఇస్తామని తెలిపారు. దీంతో బాధితులు వారి మాటలు నమ్మి రూ.30 వేలు ఇచ్చింది. బంగారం ఇవ్వాలని అడుగగా మరుసటి రోజు వచ్చి రేకు బిళ్లను ఇచ్చి మూడేళ్ల తర్వాత దాన్ని నగలు చేయించుకోమని చెప్పి వెళ్లిపోయారు. దీంతో కొడుకు డబ్బులు ఇవ్వమని అడగ్గా బంగారం కొన్నానని చెప్పి రేకు బిళ్లను కుమారునికి ఇచ్చింది. దాన్ని తీసుకుని కనిగిరిలో పరీక్షించగా అది నకిలీ బంగారంగా తేలింది. దీంతో మోసపోయిన విషయాన్ని మొగుళ్లూరు వరమ్మ పీసీపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. వారిపై కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నిందితులపై నేరం రుజువైనందున కనిగిరి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ కోర్టు న్యాయమూర్తి భరత్ చంద్ర సోమవారం నిందితులు కర్రెద్దుల కోటమ్మ, పోలయ్యలకు ఒక్కొక్కరికి మూడు నెలల జైలు శిక్ష, రూ.250 జరిమాన విధిస్తూ తీర్పు నిచ్చారు.

బైక్ దొంగలకు జైలు

కనిగిరి రూరల్: మండలంలోని చాకిరాల గ్రామానికి చెందిన మల్లెల కొండారెడ్డి, వినుకొండ పట్టణానికి చెందిన పసుమర్తి లక్ష్మీనారాయణలు జల్సాలకు అలవాటు పడి బైక్ దొంగతనాలు చేస్తున్నారు. వారిపై సీఎస్‌పురం పోలీస్‌స్టేషన్‌లో రెండు, పామూరు పోలీస్‌స్టేషన్‌లో ఒకటి, కనిగిరి పోలీస్‌స్టేషన్‌లో ఒకటి కేసులు నమోదయ్యాయి. వీరిని 18–11–24న కోర్టులో హాజరు పర్చగా ఒక్కొక్కరికి ఒక్కో కేసులో నాలుగు నెలలు జైలుశిక్ష, ఒక్కొక్కరికి రూ.100 రూపాయలు జరిమానా విధిస్తూ కనిగిరి జ్యుడిషియల్ మెజిస్ట్రేట్ ఫస్ట్ క్లాస్ న్యాయమూర్తి భరత్‌చంద్ర సోమవారం తీర్పు ఇచ్చారు.

భైరవకోనలో భక్తుల సందడి



పూజలు చేస్తున్న ఏఎస్పీ ఎస్‌వీ శ్రీధర్‌రావు, ఈఓ, నాయకులు

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం, పర్యాటకకేంద్రం భైరవకోనకు కార్తీక సోమవారం సందర్భంగా భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. ఈ సందర్భంగా కాలభైరవుడు, నగరేశ్వరుడు, త్రిముఖదుర్గాదేవి, భర్గులేశ్వర ఆలయాల్లో అర్చకులు కంబాలదిన్నె వెంకట నర్సయ్య, పంచాగ్నుల రామమూర్తిశర్మ, సుధాకర్‌శర్మలు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఒంగోలు అడిషనల్ ఎస్పీ ఎస్‌వీ శ్రీధర్‌రావు, నాయకులు దామచర్ల పూర్ణచంద్రరావు, యారవ శ్రీనివాసులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారికి అర్చకులు వేద ఆశీర్వచనం చేయగా ఈఓ, నాయకులు వారిని శేషవస్త్రంతో ఘనంగా సన్మానించి ప్రసాదం అందజేశారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో కార్తీక దీపాలు వెలిగించి తమ మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఈఓ డి.వంశీకృష్ణారెడ్డి, నాయకులు ముప్పాళ్ల శ్యాం సుందర్‌రాజుల ఆధ్వర్యంలో అన్నప్రసాదం, వసతులు సమకూర్చారు. ముప్పాళ్ల విక్రమ్‌రాజు, ఎంఆర్ శ్రీనివాసులు, భక్తులు ఉన్నారు.